AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
3-7-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

పన్ను వసూళ్లపై విచారణ



2



2

అత్తను చంపిన అల్లుడు

## రెండు నెలల పాటు చేపల వేట నిషేధం



**అక్షరటుడే, ఇందూరు:** ప్రతి ఏడాదిలో మాదిరిగా ఈ ఏడాది కూడా జులై, ఆగస్టు నెలలో చేపల వేట నిషేధమని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి తెలిపారు. వర్షాకాలంలో నీటి ప్రవాహానికి చేపలు సహజంగా ప్రేరణ చెందగా వాటికి అధిక సంఖ్యలో సంతానం కలుగుతుందన్నారు. కాబట్టి శ్రీరామ్ సాగర్, ఎగువ, దిగువ నదీ జలాల్లో చేపల వేట ఆగస్టు 31వ తేదీ వరకు చేపట్టవద్దని సూచించారు.



## తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్‌కు అంతర్జాతీయ మెడల్

**అక్షరటుడే, కామారెడ్డి:** తెలంగాణకు చెందిన కానిస్టేబుల్ అంతర్జాతీయ మెడల్ సాధించాడు. కామారెడ్డి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ మహమ్మద్ బాబా ప్రస్తుతం ఐజీపీ స్పోర్ట్స్ హైదరాబాద్‌లో అటాచ్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతనెల 27 నుంచి ఈనెల 6 వరకు అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో జరుగుతున్న వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ 2025లో పాల్గొన్నాడు. షాట్‌పుట్ ట్రాక్ అండ్ ఫీల్డ్ (35 ప్లస్) విభాగంలో తెలంగాణ నుండి భారత దేశానికి ప్రాతినిథ్యం వహించిన ఆయన బ్రాంజ్ మెడల్ సాధించి దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. ఇది కామారెడ్డి జిల్లా పోలీస్‌కు గర్వకారణమన్నారు. ప్రతిభావంతులకు మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని అభినందనలు తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ తరఫున కానిస్టేబుల్ మహమ్మద్ బాబాకు శుభాకాంక్షలు తెలిపారు.

## రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై సందీప్

**అక్షరటుడే, ఇందల్వాయి:** రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని భీమ్‌గల్ ఎస్సై కె.సందీప్ హెచ్చరించారు. గురువారం భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలు రానున్న దృష్ట్యా కఠిన నిబంధనలు అమలు చేస్తామన్నారు. రౌడీషీటర్లు ఎక్కడా కూడా తమకు సంబంధం లేని విషయాల్లో తలదూర్చవద్దని హెచ్చరించారు. గొడవల జోలికి వెళ్లవద్దని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు విధిగా హాజరు ఇవ్వాలని చెప్పారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తే చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం అవగాహన ర్యాలీ

**అక్షరటుడే, ఆర్మూర్:** డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్ నాయక్ అన్నారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ 100 రోజుల మహోద్యమంలో భాగంగా గురువారం భీమ్‌గల్ మండలంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, చెడు వ్యసనాలకు అలవాటు పడవద్దని సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణపై పోలీస్, ఎక్సైజ్ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించి నిర్మూలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సేన నాయకులు ప్రణయ్, వికాస్, సిద్ధు, అజయ్, అంజి, అరవింద్ నాయకులు పాల్గొన్నారు.




ఆర్టీసీ బస్సు ఛార్జీలు పెంచడంతో ప్రయాణికులపై భారం పడింది. టోల్ ఛార్జీలు పెరగడంతో ఆ భారాన్ని కస్టమర్లపై మోపినట్లు ఆర్టీసీ చెబుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. అయితే టికెట్ రేట్లు పెంచడంతో ఉచిత భారాన్ని భర్తీ చేసుకుంటుందనే విమర్శలు ఉన్నాయి. - అక్షరటుడే, ఇందూరు



# ఆర్టీసీలో ఛార్జీల మోత

■ హైదరాబాద్ మార్గంలో రూ. 40 వరకు పెంపు ■ ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఆరు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వీటి నుంచి ఎక్కువ బస్సులు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో మొత్తం మూడు టోల్ గేట్లు ఉండగా.. బస్ టికెట్టుపై రూ.30 నుంచి రూ.40 వరకు ఛార్జీలు పెంచారు.

### టోల్ గేట్లు లేని మార్గాల్లో సైతం..

టోల్ ఛార్జీలు పెరగడంతో టికెట్ ధరలు పెంచినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే టోల్‌గేట్లు లేని మార్గాల్లో సైతం రేట్లు పెంచడం గమనార్హం. నిజామాబాద్ - ఆర్మూర్, నిజామాబాద్ - బోధన్ మార్గాల్లో టోల్ గేట్లు లేవు. అయినా ఈ మార్గాల్లో కూడా రేట్లు పెంచారు. పల్లె వెలుగు బస్సుల్లో ఒక స్టేజీ చొప్పున నిర్ణయించి ఛార్జీలు వసూలు చేస్తారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రం మొత్తం కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకుంటారు. తాజాగా కిలోమీటర్ల సర్దుబాటు చేపట్టి రేట్లు పెంచినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గతంలో చిల్లర సమస్య పేరుతో బస్సు ఛార్జీలను రౌండప్ చేసేవారు. తాజాగా కిలోమీటర్ల చొప్పున ఛార్జీలను సర్దుబాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. దీంతో ప్రయాణికులపై అదనపు భారం పడుతుంది. నిజామాబాద్ నుంచి ఆర్మూర్‌కు 26 కిలోమీటర్లు ఉంటుంది. దీనిని 30 కిలోమీటర్లుగా సర్దుబాటు చేసి రూ.50 ఉన్న ఛార్జీని రూ.60కు పెంచారు. బోధన్ నుంచి నిజామాబాద్‌కు గతంలో రూ.50 టికెట్ ధర ఉండేది. ప్రస్తుతం దానిని రూ.60కి పెంచారు. దీంతో ప్రజలపై భారం పడుతోంది.

హైదరాబాద్‌కు బస్సు ఛార్జీలు వివరాలు (రూ.లో..)

| బస్సు | పాత ధర | కొత్త ధర |
|---|---|---|
| ఎక్స్‌ప్రెస్ | 260 | 290 |
| సూపర్ లగ్జరీ | 340 | 370 |
| ఎలక్ట్రిక్ | 360 | 390 |
| రాజధాని | 430 | 460 |
| లహరి | 450 | 480 |

### టోల్ చార్జీలు పెరగడంతోనే..



రహదారులపై ఉన్న టోల్ గేట్ల చార్జీలు పెంచారు. దీంతో ఆర్టీసీ బస్సులో రేట్లు పెంచాల్సి వచ్చింది. టోల్ గేట్లు ఉన్న మార్గాల్లో ప్రయాణించే వారిపై అదనపు భారం పడుతుంది. – జ్యోత్స్న, రీజనల్ మేనేజర్

## ఐటీ కంపెనీలతో యువతకు ఉపాధి

### ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు



**అక్షరటుడే, కామారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తెలిపారు. ఐటీ కంపెనీల ఏర్పాటుతో యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో రూ.2.40 కోట్ల నిధులతో మిషన్ భగీరథ బల్క్ నీటి కనెక్షన్ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సకల సదుపాయాలతో టీజీఐఐసీని ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గానికి ఇప్పటికే ఒక కంపెనీని తీసుకొచ్చానని పేర్కొన్నారు. అది వచ్చే నెలలో ప్రారంభం కాబోతుందని చెప్పారు. మరిన్ని కంపెనీలతో కూడా మాట్లాడుతున్నానని చెప్పారు. ఈ కంపెనీలు రావడం వల్ల నియోజకవర్గంలోని యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఎన్నోసార్లు జాబ్ మేళాలు పెట్టి యువతకు ఉపాధి కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వంతో చర్చించి కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులకు రూ.23 కోట్ల నిధులను విడుదల చేయించానని తెలిపారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ నిర్మాణ పనుల్లో భాగంగా భూంపల్లి, మోతె, కాటేవాడి జలశయాల నిర్మాణాలకు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్లతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న నిధులు క్లియరెన్స్ చేయించామన్నారు. ఆర్థిక శాఖ నుంచి ఫైనల్ అప్రూవల్ వస్తే జలాశయాల నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందేలా ప్రభుత్వంతో మాట్లాడతానని, రైతుల వివరాలను వారం రోజుల్లో అందించాలని తహశీల్దార్‌కు సూచించారు.

## ఆలయ భూమి కాపాడాలి

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని గుడిమెట్ గుట్టపై కొలువైన శివుని భూమి కబ్జాకు గురవుతోందని మాధవపల్లి గ్రామస్థులు తెలిపారు. కబ్జాదారుల బారి నుంచి భూమిని కాపాడాలని గురువారం తహశీల్దార్ రేణుక చవాన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడి భూమి గుట్ట మొత్తం దేవునికే చెందాలన్నారు. కబ్జా పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## భారీగా ఎస్సైల బదిలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాలో భారీగా ఎస్సైల బదిలీలు నిర్వహించారు. మొత్తం పది మందిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. బదిలీలపై జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తన మార్కు చూపించినట్లుగా తెలుస్తోంది.

### వీఆర్‌లో ఉన్న నలుగురికి పోస్టింగ్..

బదిల్లీలో భాగంగా వీఆర్‌లో ఉన్న నలుగురికి పోస్టింగ్ ఇచ్చారు. అలాగే ఇద్దరు ఎస్సైలను వీఆర్‌కు పంపించారు. వీఆర్‌లో ఉన్న నవీన్ చంద్రను జుక్కల్‌కు బదిలీ చేశారు. రాఘవేంద్రను నస్రుల్లాబాద్ ఎస్సైగా నియమించారు. అరుణ్ కుమార్‌ను పెద్ద కొడప్‌గల్‌గా ఎస్సైగా ట్రాన్స్‌ఫర్ చేశారు. రాజారాంనకు కామారెడ్డి టౌన్ ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. నస్రుల్లాబాద్ ఎస్సై పని చేసిన లావణ్యను రామారెడ్డికి బదిలీ చేశారు. రాజంపేట ఎస్సై పుష్పరాజ్‌ను సదాశివనగర్ ఎస్సైగా ట్రాన్స్‌ఫర్ చేశారు. సదాశివనగర్ ఎస్సై రంజిత్‌ను దేవునిపల్లి పీఎస్‌కు పంపించారు. జుక్కల్ ఎస్సై భువనేశ్వర్‌ను దేవునిపల్లి 2 ఎస్సైగా బదిలీ చేశారు. కాగా.. దేవునిపల్లి ఎస్సై రాజు, పెద్ద కొడప్‌గల్ ఎస్సై మహేందర్‌ను వీఆర్‌కు పంపించారు.

## శిథిలావస్థకు చేరుకున్న చారిత్రక నిర్మాణాలను కాపాడాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని పురాతనమైన చారిత్రక నిర్మాణాలను కాపాడి, పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ఇతిహాస సంకలన సమితి జిల్లా కమిటీ సభ్యులు కోరారు. గురువారం అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2 వేల సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఖిల్లా రామాలయం అత్యంత ప్రతిష్టాత్మకమైందని, వెంటనే పునరుద్ధరణ చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఇతిహాస సంకలన సమితి జిల్లా అధ్యక్షుడు నరేష్ కుమార్, కార్య అధ్యక్షుడు మోహన్ దాస్, ఉపాధ్యక్షురాలు శైలి బెల్లాల్, కార్యదర్శులు కందకుర్తి ఆనంద్, డాక్టర్ భూపతి తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన

**అక్షరటుడే, బిచ్కుంద:** జుక్కల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుమానిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. డ్రగ్స్ జోలికి వెళ్లి విద్యార్థులు జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హన్మంత్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, పోలీసు కళాబృందం సభ్యులు, జుక్కల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ‘డబుల్’ ఇళ్లకు తాళాలు వేసిన అధికారులు

**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని దేశాయిపేట గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు గురువారం రెవెన్యూ అధికారులు తాళాలు వేశారు. గత ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన ఇళ్లలో ఉంటున్న ఆరుగురు లబ్ధిదారుల ఇళ్లకు తాళాలు వేసి నోటీసులు అతికించారు. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. తామంతా ఇళ్లలోనే ఉంటున్నామని.. అధికారులకు ఎంత చెప్పినా వినిపించుకోకుండా తాళాలు వేసి జప్తు చేసుకోవడం ఎంతవరకు సమంజసమని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇళ్లను ఇచ్చి మళ్లీ లాక్కోవడం ఎంతవరకు సమంజసమని కన్నీరు పెట్టుకున్నారు.

### బీజేపీ నాయకుల పరామర్శ

విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, గంగారెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. పేదలకు కేటాయించిన ఇళ్లను అధికారులు మళ్లీ లాక్కోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. తక్షణమే అధికారులు లబ్ధిదారులకు తిరిగి ఇళ్లను అప్పగించాలని కోరారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

## సీజనల్ వ్యాధులపై అవగాహన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ఏడో వార్డులో మున్సిపల్ కమిషనర్ మహేష్ గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందరోజుల కార్యచరణలో భాగంగా ప్రజలకు తడి, పొడి చెత్త నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తదితర అంశాలపై వివరించారు. అలాగే పలువురి ఇళ్లకు వెళ్లి లార్వా పెరుగుదలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ గోవింద్ రెడ్డి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## జుక్కల్‌లో రోడ్ల నిర్మాణానికి రూ.32 కోట్ల నిధులు మంజూరు

**అక్షరటుడే, నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జుక్కల్‌లో రోడ్ల పరిస్థితిని మంత్రికి వివరించారు.



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

### 7న నియోజకవర్గానికి మంత్రి కోమటిరెడ్డి..

ఈ సందర్భంగా రోడ్ల పరిస్థితిని వివరించి నిధుల కోసం అడగగా మంత్రి వెంటనే స్పందించారని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. రూ.32.20 కోట్లు మంజూరు చేశారని వివరించారు. అలాగే రోడ్ల నిర్మాణ ప్రారంభోత్సవానికి ఈనెల 7న వస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గ ప్రజల పక్షాన మంత్రికి ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కృతజ్ఞతలు తెలిపారు.

## అనుమతి లేని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌కు నోటీసులు



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని వీక్లీ మార్కెట్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న శ్రీ చైతన్య టెక్నో పాఠశాలకు ఎంఈవో నాగేశ్వరరావు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు అనుమతులు లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. సదరు పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు లేదని, విద్యార్థులను పాఠశాలలో చేర్పించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. గుర్తింపులేని పాఠశాలల్లో చేర్పిస్తే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు.

## బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలి



**అక్షరటుడే, ఇందూరు:** బీసీలకు దామాషా ప్రకారమే రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బగ్గలి అజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అందరికీ దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. కానీ 56 శాతం ఉన్న బీసీలకు కేవలం 27 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించడం అన్యాయమన్నారు.

### కేంద్ర కులగణనను స్వాగతిస్తున్నాం

కేంద్ర ప్రభుత్వం కులగణన చేస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని అజయ్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏదైతే 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు ఇవ్వాలని నిర్ణయించిందో దానిని వెంటనే అమలు చేసేవిధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ రిజర్వేషన్లు రాజకీయంగా విద్యా, ఉద్యోగ పరంగా ఉండాలని సూచించారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యాడ శంకర్ మాట్లాడుతూ.. 130 బీసీ కులాల్లో ఇప్పటికీ అనేక కులాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయని.. 42 శాతం రిజర్వేషన్లు అమలైతేనే వారందరికీ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అసెంబ్లీలో చేసిన తీర్మానానికి మద్దతు ఇస్తూ కేంద్రం బిల్ పాస్ చేయాలని కోరారు.

## అభివృద్ధి పనులు వేగంగా జరగాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా జరగాలని ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పోలీస్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మెదక్ - బాసర హైవే పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పనులను కాసుల బాలరాజు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ జంగం గంగాధర్ పరిశీలించారు. ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి సూచన మేరకు పట్టణంలో డ్రెయినేజీ, ఫుట్ పాత్ పనులు జరగాలని హైవే అధికారులకు సూచించారు.

### రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్..


పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా కాంప్లెక్స్‌ల ఎదుట డ్రెయినేజీ పూడికను తొలగించి అడుగు ఎత్తు పెంచాలని, త్వరితగతిన ఫుట్ పాత్ నిర్మాణాన్ని పూర్తి చేసి వాడుకలోకి తీసుకురావాలని అధికారులకు కాసుల బాలరాజు సూచించారు. స్థానికులు స్వచ్ఛందంగా డ్రెయినేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎజాజ్, ఖలేక్, హైవే ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం పోస్టర్ల ఆవిష్కరణ



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని ఎంఆర్ గార్డెన్‌లో ఈ నెల 5న నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు మాలమహానాడు ఆర్మూర్ డివిజన్ ప్రతినిధులు పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 5న నాటకం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో మాల మహానాడు ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు మాదరి రాజన్న, ప్రధాన కార్యదర్శి ముగా ప్రభాకర్, పింజ పెద్ద భోజన్న, కోటేశ్వరరావు, తాళ్ల రాజయ్య, తెడ్డు నర్సయ్య, అంగరి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని వడ్డేపల్లి గ్రామాన్ని గురువారం ఎంపీడీవో గంగాధర్, గ్రామ ప్రత్యేక అధికారి అమర్ ప్రసాద్, ఏపీఎం రామనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీతో సమావేశమయ్యారు. ఎంత మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి, ఎందరు నిర్మాణ పనులు ప్రారంభించారు, ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయనే అంశాలపై చర్చించారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదేశాల మేరకు సింగిల్ మోటారు పైప్ లైన్ రిపేరు చేయించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

మిషన్ భగీరథ ద్వారా అందించే తాగునీటికి సంబంధించి కామారెడ్డి జిల్లాల్లో పన్ను వసూలు చేయడం తీవ్ర చర్చకు దారితీసింది. మిషన్ భగీరథ నీటికి పన్ను వసూళ్లపై 'నీటి పన్ను కట్టాల్సిందే' అనే శీర్షికన ఈనెల 1న 'అక్షరటుడే'లో కథనం ప్రచురితం కాగా.. అధికారుల్లో చలనం మొదలైంది. గ్రామాల్లో స్థానిక సిబ్బంది మిషన్ భగీరథ నీళ్లు వాడుకుంటున్న ప్రజల నుంచి ముక్కుపిండి మరీ పన్నులు వసూలు చేస్తుండడంతో ప్రజలు ఆగమయ్యారు. ఈ పరిస్థితిని 'అక్షరటుడే'లో కథనం ప్రచురితం చేయడంతో అసలు నీటి పన్ను కట్టాలా? వద్దా? అనే చర్చ గ్రామాల్లో మొదలైంది. - అక్షరటుడే, కామారెడ్డి




# భగీరథ పన్ను వసూళ్లపై విచారణ..

■ 'అక్షరటుడే' కథనానికి స్పందన ■ విచారణ చేపట్టిన అదనపు కలెక్టర్ చందర్‌నాయక్

మిషన్ భగీరథ, పంచాయతీ అధికారుల విభిన్న సమాధానాలతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించారు. కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చందర్ నాయక్ క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించారు.

### తాడ్వాయి మండలం కృష్ణాజివాడిలో..

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్ గురువారం తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామంలో విచారణ చేపట్టారు. పన్ను వసూలు చేయాల్సిన అవసరం ఎందుకొచ్చింది..? నీళ్లు సరిపడా రాకపోవడానికి గల కారణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు ఏ మేరకు సరఫరా అవుతున్నాయి..? పంచాయతీలకు సంబంధించిన బోర్లు ప్రారంభం చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందనే దానిపై విచారణ చేపట్టారు.

### నీళ్లు సరిపోవట్లేదు..

'మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదు. అందుకే పంచాయతీ బోర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నాం. భగీరథ నీటితో సగం ట్యాంక్ కూడా నిండటం లేదు. బోర్ మోటార్, ఇతర మెయింటెనెన్స్ కోసం మినిమం బిల్లు వసూలు చేస్తున్నాం' అని పంచాయతీ అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు.

### కామారెడ్డిలో బయటపడ్డ పన్ను వసూలు

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కూడా మిషన్ భగీరథ నీటికి పన్ను వసూళ్లు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే కామారెడ్డి జిల్లాలో ఈ పన్ను వసూళ్ల అంశం మొదట బయటకు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసినట్టుగా తెలుస్తోంది. అందుకే కామారెడ్డి జిల్లా నుంచే అధికారులు విచారణ ప్రారంభించినట్టుగా తెలుస్తోంది. మిగతా జిల్లాల్లో కూడా ఈ పరిస్థితిపై విచారణ జరుపనున్నట్లు సమాచారం.

### ప్రభుత్వానికి నివేదిస్తాం



గ్రామాల్లో నీటి సరఫరా పరిస్థితి, పన్ను వసూళ్లకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేపడుతున్నాం. పంచాయతీ అధికారులు, భగీరథ అధికారుల వద్ద వివరణ తీసుకున్నాం. సరిపడా తాగునీరు సరఫరా చేయలేకపోతున్నామని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. ఫలితంగా పంచాయతీ బోర్ల ద్వారా నీళ్లు ఇస్తున్నామని పంచాయతీ అధికారులు తెలిపారు. పూర్తి నివేదిక కలెక్టర్‌కు అందజేస్తాం. అక్కడినుంచి పంచాయతీ రాజ్ కమిషనర్‌కు నివేదిక పంపిస్తాం.

– చందర్ నాయక్, అదనపు కలెక్టర్



## హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే వాహనాలు సీజ్

**అక్షరటుడే, నిజాంసాగర్:** బైక్‌లపై ప్రయాణించే వ్యక్తులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఎస్సై మహేందర్ సూచించారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని అంజనీపేట్ జాతీయ రహదారిపై ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని.. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లవద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## సమ్మె నోటీస్ అందజేత



**అక్షరటుడే, బిచ్కుంద:** జుక్కల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు ఎంపీడీవో శ్రీనివాస్‌ను కలిశారు. ఈ నెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొంటున్నట్లు సమ్మె నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు సురేష్‌గొండ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక సంఘాల పిలుపు మేరకు గ్రామీణ భారత్ బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం నాయకులు గోవింద్, గంగారాం, జాదవ్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## లింగంపేటలో మెకానిక్ దినోత్సవ వేడుకలు



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలో గురువారం జాతీయ మెకానిక్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మెకానిక్‌లు కలిసి వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. 1885లో డైమ్లెర్ రేట్ వాగన్ మోటార్ సైకిల్‌ను కనిపెట్టారని, అప్పటి నుంచి అది ప్రాచుర్యంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు యూసుఫ్, ప్రధాన కార్యదర్శి భాషు, కోశాధికారి రామకృష్ణ, లక్ష్మణ్, నరేష్, రాజు, అనిల్, సురేష్, అరవింద్ పాల్గొన్నారు.

## పద్మశాలి విద్యార్థి వసతి గృహానికి ఎన్నికలు నిర్వహించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పద్మశాలి వసతి గృహం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని పద్మశాలి హాస్టల్ ఎన్నికల పోరాట కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం వసతి గృహ అధ్యక్షుడు రచ్చ మురళికి, నగర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి భూమేశ్వర్‌కు మెమోరాండం అందజేశారు. అనంతరం పోరాట కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. పద్మశాలి విద్యార్థి వసతి గృహం కార్యవర్గం కాలపరిమితి పూర్తయి ఎనిమిదేళ్లవుతున్నా ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. పద్మశాలి విద్యార్థి వసతి గృహం ఎన్నికల ప్రక్రియను వారం రోజుల్లో ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీమర్తి రవి, బొట్టు వెంకటేష్, కొండి రమేష్, సిలివేరి గణేష్, కోట నాగేష్, గాలిపల్లి రవీందర్, గోంట్యాల రమేష్, పెంటి బాలరాజ్, కారంపూడి వెంకటి, సురకుట్ల విజయ్, అంకం రాజేందర్, కోడూరు నాగరాజు, ఎర్రగుంట లక్ష్మణ్, సిరిగాధ మనోహర్, తలకొక్కుల సతీష్, భోగ మురళి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలిరావాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సన్నాక సమావేశానికి కార్యకర్తలు తరలిరావాలని వర్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేష్ బాబా, పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనిపూర్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. వర్ని మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లాల్ బహదూర్ స్టేడియంలో జరుగనున్న సన్నాహక సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని పేర్కొన్నారు.

### పీసీసీ చీఫ్ నేతృత్వంలో..

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పర్యవేక్షకురాలు మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పాల్గొంటున్నారని తెలిపారు. ఉమ్మడి వర్ని మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఎడ్లను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురికి జైలు

**అక్షరటుడే, కోటగిరి :** ఎడ్లను అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ముగ్గురికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. నాందేడ్ జిల్లాకు చెందిన షేక్ అతీక్, షేక్ సోహైల్, షేక్ ఆవేజ్ గత ఏప్రిల్ 16న వాహనంలో ఎడ్లను తరలిస్తూ పట్టుబడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, గురువారం బోధన్ కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. దీంతో విచారించిన న్యాయమూర్తి శేషతల్ప సాయి నిందితులకు ఒకరోజు జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై చెప్పారు.

## అత్తను హత్య చేసిన అల్లుడు

**అక్షరటుడే, నిజాంసాగర్ :** కుటుంబ కలహాలతో అత్తను అల్లుడు హత్య చేశాడు. ఈ ఘటన నిజాంసాగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామంలో నివసించే లక్ష్మి తన కూతురిని అదే గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి గతంలో వివాహం జరిపించింది. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం ఉదయం ఇంట్లో ఉన్న అత్తను అల్లుడు కత్తితో నరికాడు. దీంతో సంఘటనా స్థలంలోనే లక్ష్మి మృతి చెందింది. సమాచారం అందుకున్న బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, రూరల్ సీఐ రాజేష్ చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.